


జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




| | | | | | |
|---|---|---|---|---|---|
| ఆదివారం 21 జూన్ 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 02 సంచిక : 019 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |

## ధాన్యంపై కాంగ్రెస్ దగా.. రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం : లింగాల కమల్ రాజు





మధిర, ఖమ్మం జిల్లా ప్రతినిధి శెట్టి సురేష్, 21-06-2026: మధిరలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, మధిర నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జ్ లింగాల కమల్ రాజు మాట్లాడుతూ ధాన్య కొనుగోలు, రైతు భరోసా, రుణమాఫీ, సన్న వడ్ల బోనస్ తదితర అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని ఆరోపించారు. వ్యవసాయం అంటే దండుగ కాదు పండుగ అని రైతును రాజుగా చేసిన నాయకుడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని, ప్రస్తుతం కొనసాగుతున్నది ఇందిరమ్మ రాజ్యం కాదని దగా రాజ్యమని విమర్శించారు. గతంలో 33 రకాల సన్న వడ్లకు బోనస్ అందించగా ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం ఏడు రకాలకే పరిమితం చేసి రైతుల కంట కన్నీరు తెప్పిస్తోందన్నారు. అధికారంలోకి రాకముందు రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ, అన్ని రకాల సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పిందన్నారు. రైతు భరోసా, రుణమాఫీ, ఎరువుల సరఫరా విషయంలో రైతులను మోసం చేస్తోందని, ఎరువుల కోసం రైతులను క్యూలలో నిలబెట్టి ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. సన్న వడ్లకు బోనస్ ఇవ్వలేక కేంద్ర ప్రభుత్వంపై నెపం మోపుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఖమ్మం జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 3.20 లక్షల ఎకరాల్లో సన్నాల వరి సాగు జరుగుతోందని, రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి ప్రత్యక్ష కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు. రైతులతో విరోధం పెట్టుకున్న ఏ ప్రభుత్వమూ మనుగడ సాగించలేదని, ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మధిర మేజర్ సొసైటీ అధ్యక్షులు బిక్కి కృష్ణప్రసాద్, వార్డ్ కౌన్సిలర్ వై.వి. అప్పారావు, రాయపట్నం సర్పంచ్ కంచం గోపి, చిత్తారు నాగేశ్వరరావు, రావూరి శ్రీనివాసరావు, బొగ్గుల భాస్కర్ రెడ్డి, పల్లపోతు వెంకటేశ్వరరావు, వంకాయలపాటి నాగేశ్వరరావు, మొండితోక జయాకర్, రంగిశెట్టి కోటేశ్వరరావు, ధీరావత్ మాధవి తదితరులు పాల్గొన్నారు.




## ఇందిరమ్మ ఇళ్లు లేని ఊరుంటే రాజకీయం వదులుకుంటా: మైనంపల్లి

మెదక్, ప్రతినిధి అనిల్ కుమార్, 21-06-2026: రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరగని గ్రామం ఏదైనా ఉంటే తాను రాజకీయాలు వదులుకుంటానని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పేర్కొన్నారు. అలాంటి గ్రామం ఉందని ఎవరైనా నిరూపిస్తే తాను రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో మొత్తం 33 వేల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయని, వాటిలో ఇప్పటికే సుమారు 50 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. ప్రజలకు గృహ సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న ఆయన, రెండో విడతలో మరో 30 వేల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తోందని, అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## శబ్ద కాలుష్యం సృష్టించే బుల్లెట్ సైలెన్సర్లను రోడ్డు రోలర్ కింద వేసి ధ్వంసం



ఖమ్మం జిల్లా ప్రతినిధి శెట్టి సురేష్, 21-06-2026: నిబంధనలకు విరుద్ధంగా మార్పులు చేసి విపరీతమైన శబ్ద కాలుష్యం సృష్టించే బుల్లెట్ సైలెన్సర్లను పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రోడ్డుపై పరిచి రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేసినట్లు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు. బైక్‌ల విషయంలో స్టైల్ కోసం కొంతమంది యువకులు తమ వాహనాలకు అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను అమర్చుకుంటూ వాటి అసలు ఉద్దేశ్యాన్నే మార్చేస్తున్నారని అన్నారు. మరికొందరు సైలెన్సర్లకు రంధ్రాలు చేసి మరింత శబ్దం వచ్చేలా మార్పులు చేస్తున్నారని పేర్కొన్నారు. ఢాం.. ఢాం.. అంటూ పెద్ద శబ్దాలు చేస్తూ వెళ్లడం వల్ల వృద్ధులు, గుండె జబ్బులు ఉన్నవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయమై అనేక ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు పర్యవేక్షణలో నగరంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా అధిక శబ్దం చేసే సైలెన్సర్లతో తిరుగుతున్న 1650 బైకులను గుర్తించి వాటి సైలెన్సర్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అనంతరం వాటిని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రోడ్డుపై పేర్చి రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. యువత తమ బుల్లెట్ వాహనాలకు అధిక శబ్దం చేసే సైలెన్సర్లను అమర్చుకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇకపై అధిక శబ్దం చేసే హారన్లపై కూడా ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.




## సంగారెడ్డి యువతకు ఉపాధి కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: మంత్రి పొన్నం ప్రభాకర్

సంగారెడ్డి, ప్రతినిధి సందేశం టైమ్స్, 21-06-2026: ప్రధానమంత్రి విశ్వకర్మ భారత్ రోజ్‌గార్ యోజన పథకం ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సంగారెడ్డిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యువత స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం యువత సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని, ఉపాధి అవకాశాల విస్తరణకు పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకం కింద సంగారెడ్డి జిల్లాలో ఇప్పటికే సుమారు 57 వేల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. యువత నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రభుత్వ పథకాల ద్వారా మరింత మంది యువకులు లబ్ధి పొందేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆత్మబంధువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి.. 438 మంది ప్రతిభావంతులకు సైకిళ్ల పంపిణీ



పటాన్చెరు, ప్రతినిధి బి. డేవిడ్, 21-06-2026: పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి విద్యార్థుల కోసం మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పటాన్చెరు నియోజకవర్గ చరిత్రలోనే తొలిసారిగా 2025-26 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన 438 మంది విద్యార్థులకు రూ.35 లక్షల సొంత నిధులతో కొనుగోలు చేసిన సైకిళ్లను పంపిణీ చేశారు. శనివారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని 48 ప్రభుత్వ, 89 ప్రైవేటు పాఠశాలలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ఎమ్మెల్యే జీఎంఆర్ చేతుల మీదుగా సైకిళ్లు అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా ఉన్నత లక్ష్యాల సాధనకు మరింత ఉత్సాహం కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం పదో తరగతి విద్యార్థులకు మానసిక వికాస శిక్షణా తరగతులు, పరీక్షా సామాగ్రి పంపిణీతో పాటు ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారికి నగదు బహుమతులు అందజేస్తున్నామని గుర్తు చేశారు. ఈ విద్యా సంవత్సరం నుంచి వినూత్నంగా సైకిళ్ల పంపిణీ చేయాలని నిర్ణయించి, ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు సైకిళ్లు అందించినట్లు తెలిపారు. పదో తరగతి విద్యార్థుల జీవితంలో కీలకమైన మలుపు అని, ఈ దశలో సాధించే ఫలితాలే భవిష్యత్ విద్యాభ్యాసానికి బలమైన పునాది అవుతాయని పేర్కొన్నారు. లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని విద్యార్థులకు సూచించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రోత్సహించడం సమాజ బాధ్యత అని, విద్యార్థుల భవిష్యత్ కోసం తమవంతు సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి అండగా నిలుస్తూ విద్యార్థులకు ఆత్మబంధువుగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సేవలు అందిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, ప్రైవేటు పాఠశాలల ప్రిన్సిపాళ్లు, కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అధిక ధరకు యూరియా విక్రయించిన ఎరువుల దుకాణం లైసెన్స్ సస్పెన్షన్





సూర్యాపేట, ప్రతినిధి సందేశం టైమ్స్, 21-06-2026: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, తుంగతుర్తి ఏడీఏ రమేష్ బాబు, మండల వ్యవసాయ అధికారి మద్దిరాల మండలంలోని స్వర్ణ ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణాన్ని తనిఖీ చేశారు. తనిఖీలలో రైతులకు యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించడంతో సంబంధిత దుకాణం లైసెన్స్‌ను సస్పెండ్ చేసినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలోని ఎరువుల డీలర్లు ఎవరైనా రైతుల నుంచి అధిక ధరలు వసూలు చేసినా లేదా నిబంధనలను ఉల్లంఘించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. ప్రస్తుతం సూర్యాపేట జిల్లాలో 18,845 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని, వాగన్లు మరియు రోడ్డు మార్గాల ద్వారా యూరియా నిరంతర సరఫరా కొనసాగుతోందని తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, అవసరమైన మేరకే యూరియా కొనుగోలు చేయాలని సూచించారు. ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా రైతులు విడతల వారీగా యూరియాను బుక్ చేసుకుని పొందవచ్చని అధికారులు వెల్లడించారు. రైతులకు సరిపడా ఎరువులు అందించేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటోందని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు.

# ఘనంగా పుట్టినరోజు వేడుకలు



పటాన్చెరు, ప్రతినిధి బి. డేవిడ్, 21-06-2026: ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని చిన్న కంజర్ల గ్రామానికి చెందిన ఏం. రాజు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్కర్ కంపెనీ స్నేహితులు కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కిరీటాల లక్ష్మణ్ మాట్లాడుతూ మంచి చెడుల్లో తోడుండే స్నేహమే నిజమైన సంపద అని, తమ స్నేహితుడు రాజుకు అందరి తరఫున హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం స్నేహితులు రాజుకు కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, కంజర్ల నరసింహ, సందేశం టైమ్స్ రిపోర్టర్ డేవిడ్, కంజర్ల శ్రీశైలం, కిరీటాల లక్ష్మణ్, మైలారం నర్సింలు, కంజర్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అల్లాదుర్గం - చేవెళ్ల రహదారి సరకుప్రాయం.. మరమ్మతులు చేపట్టాలని ప్రజల విజ్ఞప్తి



అల్లాదుర్గం, ప్రతినిధి అనిల్ కుమార్, 21-06-2026: అందోల్ నియోజకవర్గ పరిధిలోని అల్లాదుర్గం మండల కేంద్రం నుంచి చేవెళ్ల గ్రామానికి వెళ్లే కంకర రహదారి పూర్తిగా దెబ్బతిని ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. రోడ్డుపై కంకర తేలిపోవడంతో గ్రామస్తులు, వాహనదారులు భయాందోళనల మధ్య ప్రయాణాలు సాగిస్తున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజువారీగా ఈ మార్గంలో ప్రయాణించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అవసరమైన నిధులు మంజూరు చేసి వెంటనే రహదారికి మరమ్మతులు చేపట్టి ప్రజలకు సురక్షిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ఇన్‌స్టాగ్రామ్‌లో వలపు వల.. రూ.12 లక్షలు స్వాహా



మెదక్, ప్రతినిధి అనిల్ కుమార్, 21-06-2026: మెదక్ జిల్లాలో హనిట్రాప్ మోసం వెలుగుచూసింది. టెక్నాలజీని అడ్డంగా పెట్టుకుని కొత్త కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్లు సోషల్ మీడియాలో నకిలీ ఐడీలతో అమాయకులను ట్రాప్ చేస్తున్న ఘటన వెలుగులోకి వచ్చింది. ప్రేమ, పెళ్లి పేరుతో నమ్మించి యువతులను, యువకులను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్న దుండగులు ఓ బాధితుడి నుంచి విడతల వారీగా రూ.12 లక్షల నగదు, బంగారు నగలను కాజేసినట్లు సమాచారం. మోసపోయిన విషయం తెలుసుకున్న బాధితుడు పోలీసులను ఆశ్రయించగా, అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. సోషల్ మీడియా ద్వారా పరిచయమయ్యే వ్యక్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత వివరాలు, నగదు లేదా విలువైన వస్తువులు ఎవరికీ ఇవ్వవద్దని పోలీసులు సూచించారు.

# అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రంగంపేటలో అవగాహన కార్యక్రమం



రంగంపేట, ప్రతినిధి సందేశం టైమ్స్, 21-06-2026: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రంగంపేట గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో యోగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ స్వర్ణలత విజయ్ కుమార్ మాట్లాడుతూ యోగా శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమని, ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి వెంకట్రాం మాట్లాడుతూ యోగా ఆరోగ్య పరిరక్షణకు ఉత్తమ సాధనమని, ప్రజలు యోగాను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యోగా ప్రాముఖ్యత, ఆరోగ్య ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు శంకర్, వెంకట్ గౌడ్, మేఘమాల, మమత, సత్యమ్మ, పోచమ్మ, గ్రామపంచాయతీ సిబ్బంది, మహిళలు, యువత మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి రామచంద్రాపురం ఈఎస్ఐ ఆసుపత్రిని పరిశీలించిన కాట శ్రీనివాస్ గౌడ్





పటాన్చెరు, ప్రతినిధి బి. డేవిడ్, 21-06-2026: పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని రామచంద్రాపురం ఈఎస్ఐ ఆసుపత్రిని తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు మరియు భూగర్భ శాస్త్ర శాఖల మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ మంత్రితో కలిసి పాల్గొన్నారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, చికిత్సా విధానం, మౌలిక వసతులు, పారిశుద్ధ్య పరిస్థితులు మరియు సిబ్బంది పనితీరును పరిశీలించిన మంత్రి వివేక్ వెంకటస్వామి, కాట శ్రీనివాస్ గౌడ్ రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.



# కార్మికులకు రూ.26 వేల వేతనం చెల్లించాలి: సీఐటీయూ

జోగిపేట, అందోల్ మండల ప్రతినిధి, 21-06-2026: జోగిపేట ప్రాంతీయ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు నెలకు రూ.26 వేల వేతనం చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆసుపత్రి అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం వేతనాలు చెల్లించాలని, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల సంక్షేమం కోసం అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.




# శ్రీ పోచమ్మ తల్లి ఆలయం 9వ వార్షికోత్సవంలో పాల్గొన్న మెట్టు కుమార్ యాదవ్

పటాన్చెరు, ప్రతినిధి బి. డేవిడ్, 21-06-2026: జేపీ కాలనీలోని శ్రీ వేణుగోపాల స్వామి వారి ఆలయ పరిధిలో గల శ్రీ శ్రీ పోచమ్మ తల్లి ఆలయం 9వ వార్షిక మహోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పటాన్చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అభివృద్ధి, భక్తుల సంక్షేమం కోసం ఆలయ కమిటీ చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కె. నరసింహులు, ఆర్ఎం ఈశ్వరప్ప, పాండు, పండరి, రామకృష్ణ, బాలకృష్ణ, అశోక్, శ్రీనివాస్, శివనాగేష్, మాధవరెడ్డి, అరుణ, కరుణాకర్, శ్రీనివాస బాబు తదితరులు మరియు శ్రీ పోచమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# సమస్యలుంటే సంకోచించవద్దు.. నేరుగా తెలియజేయండి: అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్



మెదక్, ప్రతినిధి సందేశం టైమ్స్, 21-06-2026: మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించిన వారాంత పరేడ్‌కు జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్ హాజరై గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖలో హైరార్కీ వ్యవస్థకు ఎంతో ప్రాధాన్యం ఉంటుందని, అధికారులు ఇచ్చే ఆదేశాలను ప్రతి పోలీసు సిబ్బంది విధిగా పాటించాలని సూచించారు. విధి నిర్వహణలో కొన్నిసార్లు 10 నుంచి 12 గంటలపాటు పనిచేయాల్సి వస్తుందని, అలాంటి పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు పరేడ్ ద్వారా శారీరక, మానసిక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ అలవడుతుందన్నారు. యూనిఫామ్ కేవలం దుస్తులు మాత్రమే కాదని, అది పోలీసు శాఖలోని క్రమశిక్షణ, ఐక్యత, బాధ్యతలకు ప్రతీక అని పేర్కొంటూ ప్రతి పోలీసు సిబ్బంది యూనిఫామ్‌కు గౌరవం తీసుకొచ్చేలా విధులు నిర్వహించాలని సూచించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మహిపాల్ మృతి చెందడం బాధాకరమని పేర్కొంటూ, అనుకోని పరిస్థితుల్లో కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రతి పోలీసు ఉద్యోగి శాలరీ ప్యాకేజీ సౌకర్యం కలిగిన బ్యాంకు ఖాతాను కలిగి ఉండాలని సూచించారు. అలాగే హోంగార్డు సిబ్బంది కూడా హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంకుల శాలరీ ప్యాకేజీలను వినియోగించుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్ బెట్టింగ్, జూదం వంటి వ్యసనాలకు పూర్తిగా దూరంగా ఉండాలని హెచ్చరిస్తూ, అలాంటి అలవాట్లు ఆర్థిక నష్టాలతో పాటు మానసిక ఒత్తిడికి దారితీస్తాయని అన్నారు. విధి నిర్వహణలో గానీ, వ్యక్తిగతంగా గానీ ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చి నేరుగా తెలియజేయాలని, సిబ్బంది సంక్షేమానికి జిల్లా పోలీసు యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ పరేడ్‌లో డీఎస్పీ ప్రసన్న కుమార్, ఆర్ఐలు శైలేందర్, రామకృష్ణ, ఎస్ఐలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# సంగారెడ్డి జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరమ్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



నారాయణఖేడ్, ప్రతినిధి సందేశం టైమ్స్, 21-06-2026: సంగారెడ్డి జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరమ్ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు బోట్ల కార్తీక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశంలో జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాగ్లిమేట్ గ్రామానికి చెందిన నారాయణఖేడ్ మండల ఉప సర్పంచ్ ఈ. కిశోర్ కుమార్‌కు రాష్ట్ర జనరల్ సెక్రటరీగా కీలక బాధ్యతలు అప్పగించారు. అలాగే టేకూర్ గ్రామ ఉప సర్పంచ్ నర్సింలును జిల్లా అధ్యక్షుడిగా, మల్కాపూర్ ఉప సర్పంచ్ ప్రవీణ్‌ను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నారు. నూతన కమిటీ జిల్లా వ్యాప్తంగా ఉప సర్పంచ్‌ల సమస్యల పరిష్కారం, గ్రామాల అభివృద్ధి, స్థానిక సంస్థల బలోపేతం కోసం సమిష్టిగా కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న ఉప సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు నూతన కమిటీ సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామీణాభివృద్ధి, ప్రజాసేవలే లక్ష్యంగా ముందుకు సాగాలని రాష్ట్ర అధ్యక్షుడు బోట్ల కార్తీక్ ఆకాంక్షించారు.



## అన్ని గ్రామాల రోడ్లకు మహర్దశ: మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి

సూర్యాపేట, జూన్ 21 (ప్రతినిధి): రాష్ట్రంలోని అన్ని గ్రామాల రోడ్లకు మహర్దశ పట్టనుందని రాష్ట్ర నీటిపారుదల మరియు ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. చింతలపాలెం మండలంలో రూ. 10 కోట్లతో నూతనంగా నిర్మాణం చేసిన మేళ్లచెరువు నుండి చింతిర్యాల వరకు గల బీటీ డబుల్ రోడ్డును శనివారం ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పడిన చింతలపాలెం మండలంలో గతంలో రోడ్లు, ప్రభుత్వ కార్యాలయాల సౌకర్యాలు సరిగ్గా లేవని, ప్రస్తుతం ప్రజా అవసరాల నిమిత్తం మండలంలో పోలీస్ స్టేషన్, తాసిల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాలను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యాలయాల నిర్మాణ పనులు పూర్తికావస్తున్నందున త్వరలోనే వీటిని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు. వీటితో పాటు మండలంలోని అన్ని గ్రామాలకు నూతన రోడ్లు మంజూరు చేయడంతో పాటు, లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ద్వారా మండలంలోని మెజారిటీ గ్రామాలకు సాగునీరు అందించి రైతాంగాన్ని ఆదుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, ఆర్ అండ్ బి ఎస్సీ సీతారామయ్య, చింతలపాలెం తాసిల్దార్, డీసీసీ జిల్లా అధ్యక్షులు గుడిపాటి నరసయ్య, స్థానిక సర్పంచ్, ఇతర ప్రజాప్రతినిధులు మరియు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## నాపై ఆరోపణలు చేయడం సరికాదు.. నిజాలు తెలుసుకొని మాట్లాడాలి: సొసైటీ ఛైర్మన్ కులకర్ణి అనంత రావు

మెదక్ నియోజకవర్గం, జూన్ 21 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల కేంద్రంలోని సొసైటీలో 50 యూరియా బస్తాలను తాను అక్రమంగా తీసుకున్నట్లు పత్రికల్లో రాయడం, కొందరు రాజకీయ నాయకులు తనపై ఆరోపణలు చేయడం ఎంతమాత్రం సరికాదని సొసైటీ ఛైర్మన్ కులకర్ణి అనంత రావు మండిపడ్డారు. సొసైటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎవరో చెప్పిన మాటలు నమ్మి నిజానిజాలు తెలుసుకోకుండా వార్తలు రాయడం, ఆరోపణలు చేయడం బాధ్యతారాహిత్యమన్నారు. సొసైటీకి మొత్తం 100 యూరియా బస్తాలు రాగా, స్థానిక రైతులు వచ్చి 50 బస్తాల వరకు తీసుకెళ్లారని, మిగిలిన 50 బస్తాల కోసం ఎవరూ రాకపోవడంతో సదరు బస్తాలకు పూర్తి మొత్తంలో డబ్బులు కట్టి రైతుల పేరు మీద తాను తీసుకెళ్లడం తప్పా అని ఆయన ప్రశ్నించారు. ఛైర్మన్‌గా ఉన్నానని తానేమీ ఉచితంగా తీసుకెళ్లలేదని, అన్ని బస్తాలకు రశీదుల ప్రకారం డబ్బులు చెల్లించే తీసుకెళ్లానని, ఆ తర్వాత ఇద్దరు రైతులు వచ్చి అడగడంతో వారికి కూడా ఐదు బస్తాలు ఇచ్చానని స్పష్టం చేశారు. వాస్తవాలు గ్రహించకుండా కొందరు అగ్రికల్చర్ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారని, ఎవరైనా సరే నిజాలు తెలుసుకున్నకే మాట్లాడితే మంచిదని హితవు పలికారు. సొసైటీలో క్రాప్ లోన్ (పంట రుణాలు) తీసుకొని కట్టకుండా తిరుగుతున్న వారు చాలా మంది ఉన్నారని, అలాంటి వారే ఈ రోజు సొసైటీ ఛైర్మన్‌పై కుంభకోణం అంటూ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రైతు సంఘం నుండి రుణాలు ఎగవేసిన వారికి త్వరలోనే నోటీసులు పంపిస్తామని, బాకీ ఉన్న లోన్లు అన్నీ సకాలంలో కడితేనే మన సంఘం బాగుపడుతుందని తెలిపారు. అలాగే ఎల్టీ లోన్ (LT Loan) తీసుకున్న వారు కూడా తొందరగా చెల్లిస్తే, మిగతా రైతులకు కొత్తగా లోన్లు ఇవ్వడానికి వీలుంటుందని ఈ సందర్భంగా అనంత రావు పేర్కొన్నారు.

## వట్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



వట్‌పల్లి, జూన్ 21 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గ్రామ 5వ వార్డు సభ్యుడు ఎర్రోళ్ల శ్రీనివాస్ నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానంగా పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు విద్యను అభ్యసిస్తారని, వారికి తన వంతుగా సహాయం చేయాలనే ఉద్దేశంతో నోటు పుస్తకాలు అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులందరూ సమయాన్ని వృథా చేయకుండా బాగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రంజిత్ కుమార్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణను బాల్య వివాహ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలి: మంత్రి సీతక్క

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, జూన్ 21: తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (TGSCPCR) ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య మరియు సక్షమ్ అంగన్‌వాడీ కార్యక్రమాలపై శనివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి సమీక్షా సమావేశానికి కమిషన్ గౌరవ అధ్యక్షురాలు శ్రీమతి సీతా దయాకర్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి దనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం మహిళలు, పిల్లల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోందని, అయితే కొన్ని ప్రాంతాల్లో ఇంకా బాల్య వివాహాలు జరుగుతుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. శాఖలోని ప్రతి అధికారి మరియు సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించి, బాల్య వివాహాల నివారణకు గట్టిగా కృషి చేసి తెలంగాణను బాల్య వివాహ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని ఆమె సూచించారు. పిల్లల రక్షణ చర్యలను మరింత బలోపేతం చేయడంతో పాటు, వారిపై జరుగుతున్న దుర్వినియోగం మరియు పోక్సో (POCSO) కేసులను తగ్గించేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీమతి అనితా రామచంద్రన్ మాట్లాడుతూ.. మహిళలు, పిల్లల సంక్షేమానికి సంబంధించిన ప్రభుత్వ విధానాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడానికి అధికారులు తమ అత్యుత్తమ సామర్థ్యంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షలో మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకురాలు శ్రీమతి ఎన్. మోతి, వివిధ జిల్లాల మహిళా, శిశు సంక్షేమ అధికారులు (DWOs), జిల్లా బాలల పరిరక్షణ అధికారులు (DCPOs) లతో పాటు తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ గౌరవ సభ్యులు శ్రీమతి మర్రిపల్లి చందన, శ్రీమతి బండి అపర్ణ, శ్రీమతి కంచర్ల వందన గౌడ్, శ్రీమతి ప్రేమలత అగర్వాల్, శ్రీమతి గోగుల సారిత మరియు శ్రీ బుర్రా వచన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ రోడ్డుకు ట్రంప్ పేరును వెంటనే తొలగించాలి: మెదక్‌లో నల్లజెండాలతో సిఐటియు నిరసన







మెదక్ నియోజకవర్గం, జూన్ 21 (సందేశం టైమ్స్ ప్రతినిధి): హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ పరిధిలోని నానక్‌రామ్‌గూడ అమెరికా కన్సల్టెన్సీ ప్రాంతంలో గల రోడ్డుకు ట్రంప్ పేరును వెంటనే తొలగించాలని సిఐటియు (CITU) మెదక్ జిల్లా కార్యదర్శి ఏ.మల్లేశం డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తరహాలోనే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అమెరికాకు లొంగుబాటు వైఖరిని అవలంబిస్తోందని విమర్శిస్తూ, రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శనివారం మెదక్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నల్లజెండాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ సామ్రాజ్యవాద కాంక్ష కలిగిన అమెరికా ఒకవైపు భారతదేశంపై అనేక ఆంక్షలు విధిస్తూ, చదువుల కోసం వెళ్లిన భారతీయ విద్యార్థుల పట్ల క్రూరంగా వ్యవహరిస్తూ, బేడీలు వేసి విమానం ఎక్కించి వెనక్కి పంపుతూ దేశ సార్వభౌమత్వాన్ని, గౌరవాన్ని తీవ్రంగా అవమానిస్తోందని దుయ్యబట్టారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్‌తో కలిసి అమెరికా చేస్తున్న యుద్ధాల కారణంగానే అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్, వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్, యూరియా ముడిసరుకుల ధరలు పెరిగి భారత ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని గుర్తుచేశారు. రష్యాతో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచే సత్సంబంధాలు ఉన్నాయని, అయితే భారత్ అంతర్గత వ్యవహారాల్లో అమెరికా జోక్యం చేసుకుంటూ దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తోందని, ఇటువంటి దుశ్చర్యలను నరేంద్ర మోడీ సర్కారు ఖండించకపోగా లొంగుబాటు వైఖరిని ప్రదర్శిస్తోందని విమర్శించారు. అనేక విషయాల్లో కేంద్ర ప్రభుత్వ బాటలోనే నడుస్తున్న తెలంగాణ కాంగ్రెస్ సర్కార్, హైదరాబాద్‌లోని ఒక రోడ్డుకు ట్రంప్ పేరు పెట్టడం వారి నిజస్వరూపాన్ని బయటపెట్టిందని, ప్రజలను దోచుకోవడంలో మరియు దేశ సార్వభౌమత్వాన్ని అమెరికాకు తాకట్టు పెట్టడంలో రెండు ప్రభుత్వాలది ఒకే దారి అనే విషయాన్ని తేటతెల్లం చేస్తోందన్నారు. ఇప్పటికైనా నానక్‌రామ్‌గూడ రోడ్డుకు పెట్టిన ట్రంప్ పేరును తక్షణమే తొలగించి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి జె.సంతోష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## పాడి రైతుకు భరోసా.. 27 లక్షల మంది విద్యార్థులకు 'విజయ' పాలు: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క






హైదరాబాద్, జూన్ 21 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రాష్ట్రంలో పాడి పరిశ్రమ మీద ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులను ఆదుకోవడంతో పాటు విజయా డైరీని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రజా ప్రభుత్వం అన్ని అవసరమైన చర్యలు తీసుకుంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. పాల ఉత్పత్తులపై ఆధారపడిన వారి జీవితాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలను గుర్తుచేస్తూ, ఇకపై ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు విజయా డెయిరీ నుంచే పాలను సరఫరా చేయాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు సచివాలయంలో పశుసంవర్థక శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో రాష్ట్రంలో పాల వినియోగం, సేకరణ, రైతులకు చెల్లించాల్సిన బిల్లులపై లోతుగా చర్చించారు. కొత్తగా ప్రకటించిన విధానం ద్వారా వివిధ పాఠశాలల్లో చదువుకుంటున్న 27 లక్షల మంది విద్యార్థులకు పాలను అందించే అంశంపై అధికారులతో సమీక్షించిన డిప్యూటీ సీఎం, రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయికి వెళ్లి పాలిచ్చే పశువుల వాస్తవ సంఖ్యను మరియు వాటి ద్వారా వస్తున్న వాస్తవ ఉత్పత్తిని లెక్కగట్టి తదుపరి సమావేశం నాటికి సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. రైతుల నుంచి సేకరించే పాల ధరపై స్పష్టమైన విధానం ఉండాలని, పాఠశాలలకు సరఫరా చేసే పాలకు సంబంధించిన బిల్లులను సంక్షేమ శాఖలు నేరుగా ఆయా విభాగాలకే బదిలీ చేయడం ద్వారా రైతులకు ఎలాంటి బకాయిలు లేకుండా ఎప్పటికప్పుడు చెల్లింపులు జరపాలని సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు పాడి పరిశ్రమ ప్రధాన జీవనోపాధి అని, రైతులకు సమయానికి డబ్బులు చెల్లిస్తే డైరీపై నమ్మకంతో పాలు పోస్తారని, తద్వారా వారి కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయని పేర్కొంటూ, తెలంగాణలో పాడి పరిశ్రమను లాభసాటిగా మార్చేందుకు మరియు పాల ఉత్పత్తిని గణనీయంగా పెంచేందుకు ఆధునిక పద్ధతులను అనుసరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## ఓటర్ల జాబితా సవరణ 'ఎస్ఐఆర్' ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి: సిఇఒ సి. సుదర్శన్ రెడ్డి




హైదరాబాద్నం , సందేశం టైమ్స్ ప్రతినిధి, జూన్ 21: అర్హులైన ప్రతి ఓటరు పేరును ఓటరు జాబితాలో నమోదు చేయాలని, అనర్హులైన వారి పేర్లను తొలగించాలనే ఉద్దేశ్యంతోనే భారత ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని చేపట్టిందని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ) సి. సుదర్శన్ రెడ్డి, ఐఎఎస్ పేర్కొన్నారు. శనివారం బీఆర్‌కే భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈనెల 25వ తేదీ నుండి ప్రారంభం కానున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) ఇంటింటికీ వెళ్లి గణన ఫారమ్స్ (Enumeration Forms) పంపిణీ చేసే కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని వెల్లడించారు. ఈ గణన ఫారమ్స్ పంపిణీ కార్యక్రమం జూన్ 25 నుండి జూలై 24 వరకు నెల రోజుల పాటు కొనసాగుతుందని, ఈ గడువు ఎలాంటి పొడిగింపు ఉండదని ఆయన స్పష్టం చేశారు. బీఎల్‌ఓలు ఓటర్లకు గణన ఫారమ్‌లను పూరించడంలో సహాయం చేస్తారని, ఇందుకోసం వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చామని, వారు ప్రతి ఇంటిని కనీసం మూడుసార్లు సందర్శించి ఫారమ్‌లను పంపిణీ చేయడంతో పాటు పూరించిన వాటిని సేకరిస్తారని తెలిపారు. ఈ ప్రక్రియలో బీఎల్‌ఓలు కీలక పాత్ర పోషిస్తారని, అలాగే పోలింగ్ కేంద్రాల పరిధిలో బూత్ స్థాయి ఏజెంట్లు (బిఎల్‌ఏలు) కూడా వారికి సహకరిస్తారని చెప్పారు. ఓటర్లు తమ గణన ఫారమ్‌లను ఆన్‌లైన్ ద్వారా voters.eci.gov.in వెబ్‌సైట్‌లో కూడా సమర్పించవచ్చుని, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ-2026 కార్యక్రమంపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామని వివరించారు. బీఎల్‌ఓలు ఇళ్లకు వచ్చినప్పుడు ఓటర్లందరూ ఈ ఎస్ఐఆర్ ప్రక్రియకు పూర్తిస్థాయిలో సహకరించాలని సిఇఓ విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి, ఐఏఎస్, సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి శ్రీమతి ఎం. సత్యవాణి, ఐఏఎస్, ప్రభుత్వ అదనపు కార్యదర్శి శంకర్, సహాయ కార్యదర్శి ఎ.ఎస్. చారి, బి. చెన్నయ్య (SGDC) మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: సీఐటీయూ ఆందోల్ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్




జోగిపేట, సందేశం టైమ్స్ ప్రతినిధి, జూన్ 21: ఆందోల్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పేషంట్ కేర్ సిబ్బంది, సానిటరీ కార్మికులు, సెక్యూరిటీ గార్డులు మరియు ఇతర కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, అలాగే వారికి కనీస వేతనం రూ. 26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని సీఐటీయూ ఆందోల్ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆసుపత్రి కార్మికులతో కలిసి ఆయన హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సౌజన్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ.. గత 15 నుండి 20 సంవత్సరాలుగా ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న కార్మికులను ఇప్పటికీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకపోవడం అత్యంత బాధాకరమన్నారు. నిరంతరం పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కార్మికుల కనీస వేతనాలు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని, దాంతో పాటు ఈఎస్ఐ (ESI), పీఎఫ్ (PF) వంటి చట్టబద్ధమైన కార్మిక హక్కులను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెంబర్ 60 ప్రకారం కాంట్రాక్ట్ కార్మికులకు రూ. 15,600 వేతనం చెల్లించాల్సి ఉండగా, ఇక్కడ కేవలం రూ. 11 వేలు మాత్రమే చెల్లిస్తూ తీవ్రమైన శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. తక్షణమే సదరు జీఓ ప్రకారం వేతనాలు చెల్లించేలా చొరవ చూపాలని, కార్మికులను ఆర్థికంగా దోపిడీ చేస్తున్న కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇకనైనా మధ్యవర్తుల కాంట్రాక్ట్ విధానాన్ని పూర్తిగా రద్దు చేసి, ప్రభుత్వమే నేరుగా కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జీతాలు జమ చేయాలని స్పష్టం చేశారు. కార్మికులకు కనీస వేతనాలు మరియు హక్కులు అమలు అయ్యే వరకు రాబోయే రోజుల్లో ఆందోళనలను, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ యూనియన్ నాయకులు హరి, శ్రావణ్, భీమ్రావు, శేఖర్, లక్ష్మి, జయమ్మ మరియు పెద్ద సంఖ్యలో కాంట్రాక్ట్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ మెట్రో పెండింగ్ అంశాలపై కేంద్ర మంత్రులతో భేటీ: మంత్రి కిషన్ రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, జూన్ 21: హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించిన పెండింగ్ అంశాలపై చర్చించేందుకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డికి మరోసారి లేఖ రాశారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 విస్తరణకు సంబంధించిన అంశాలు త్వరితగతిన పరిష్కారం కావడం కోసం కేంద్రం జోక్యం చేసుకోవాలని, గతంలో 2026 జూన్ 16న తాను రాసిన లేఖను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించి ఐఆర్ఎఫ్‌సీ (IRFC) నిధుల విడుదలకు సంబంధించిన పెండింగ్ అంశాల పరిష్కారం, మెట్రో ఫేజ్-2 అమలు తదితర కీలక అంశాలను ఆ లేఖలో వివరించినట్లు పేర్కొన్నారు. ఈ నెల జూన్ 22, 23 తేదీలలో తాను న్యూఢిల్లీ పర్యటనలో ఉండనున్నట్లు శ్రీ కిషన్ రెడ్డికి రాసిన లేఖలో తెలియజేస్తూ, ఈ సందర్భంగా కేంద్ర రైల్వే శాఖ మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని కోరారు. కిషన్ రెడ్డితో పాటు తాను కూడా అశ్విని వైష్ణవ్ గారిని కలిసి ఈ పెండింగ్ అంశాలపై చర్చించాలనే అభిప్రాయాన్ని ముఖ్యమంత్రి లేఖలో వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగరం మరియు తెలంగాణ రాష్ట్రానికి అత్యంత కీలకమైన పట్టణ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుగా హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యత ఉన్నదని తెలియజేస్తూ, దీనికి సంబంధించిన పెండింగ్ అంశాలు సత్వరం పరిష్కారం కావాలని అభిలషించారు. కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ గారితో జరిగే సమావేశంలో మెట్రోకు సంబంధించిన అన్ని అంశాలను సమగ్రంగా వివరించి, ముందుకు వెళ్లే మార్గంపై నిర్మాణాత్మక చర్చ జరిపే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ చర్చలకు అవసరమైన సంబంధిత ఒప్పందాలు, ఇతర పత్రాల ప్రతులను కూడా తాను వెంట తీసుకువస్తానని ముఖ్యమంత్రి పేర్కొంటూ, సమావేశ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుని, దానికి సంబంధించిన వివరాలను వీలైనంత త్వరగా తెలియజేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ లేఖలో కోరారు.

# హైదరాబాద్ నగరంతో పాటు పలు జిల్లాలకు భారీ వర్ష సూచన




హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, జూన్ 21: తెలంగాణలో వాతావరణం ఒక్కసారిగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. రాబోయే రెండు గంటల్లో హైదరాబాద్ నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసే అవకాశముందని అధికారులు తెలిపారు. అలాగే మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, నల్గొండ, జోగులాంబ గద్వాల, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లోనూ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. ఈ వర్షంతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజలు అవసరం లేకుంటే బయటకు వెళ్లకూడదని, ముఖ్యంగా చెట్ల కింద నిలబడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వలు ఏర్పడే అవకాశం ఉండటంతో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని, ఉరుములు, మెరుపుల సమయంలో సురక్షిత ప్రదేశాల్లోనే ఉండాలని వాతావరణ శాఖ అధికారులు ప్రజలను కోరారు.



# ఏపీలో పలు జిల్లాల్లో ఈదురుగాలులు, పిడుగులతో కూడిన వర్షాలు

ఆంధ్రప్రదేశ్, సందేశం టైమ్స్ ప్రతినిధి, జూన్ 21: ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా మారడంతో పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ముఖ్యంగా బాపట్ల, నెల్లూరు జిల్లాలతో పాటు రాయలసీమ ప్రాంతంలోని పలు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఉరుములు, మెరుపులతో రైతులు, ప్రజలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిడుగుల సమయంలో చెట్ల కింద నిలబడకుండా, బహిరంగ ప్రదేశాల్లో సంచరించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. ఈ వర్షాల కారణంగా కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు తగ్గి వాతావరణం చల్లబడే అవకాశం ఉండగా, వ్యవసాయ పనులు చేపట్టే రైతులు స్థానిక వాతావరణ సూచనలను గమనిస్తూ తగిన జాగ్రత్తలు పాటించాలని అధికారులు స్పష్టం చేశారు.



# మోదీ ప్రారంభించిన పథకాలు ఎప్పటికీ ఆగవు: కేంద్ర మంత్రి బండి సంజయ్

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, జూన్ 21: ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు ఎప్పటికీ ఆగవని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని నిరంతరం పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు 12 లక్షల మందికి పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించిందని బండి సంజయ్ తెలిపారు. అలాగే రైతుల కోసం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం ఒక్కసారి కూడా నిలిచిపోలేదని, అర్హులైన రైతులందరికీ నిరంతరం ఆర్థిక సహాయం అందుతోందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. దేశంలో రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేయడంలో కేంద్ర ప్రభుత్వమే కీలక పాత్ర పోషిస్తోందని ఆయన చెప్పారు. వ్యవసాయ రంగానికి అవసరమైన యూరియా, డీఏపీ ఎరువులపై కేంద్రం భారీ సబ్సిడీని భరిస్తోందని పేర్కొన్నారు. ఎరువుల ధరలు పెరిగినా ఆ భారం రైతులపై పడకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం రూ. 12 వేల కోట్లకు పైగా సబ్సిడీ అందిస్తోందని బండి సంజయ్ వెల్లడించారు. రైతుల సంక్షేమం, దేశ వ్యవసాయాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

# ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి: ఆ మహనీయుని త్యాగాలను స్మరించుకున్న సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, జూన్ 21: తెలంగాణ జాతిపిత, స్వరాష్ట్ర స్వాప్నికులు ప్రొఫెసర్ కె. జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుడి త్యాగాన్ని, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన అలుపెరగని కృషిని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఘనంగా స్మరించుకున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే ఉచ్ఛ్వాస నిచ్ఛ్వాసలుగా జయశంకర్ సార్ తన జీవితాన్ని గడిపారని గుర్తుచేసుకున్న ముఖ్యమంత్రి, ఆ మహనీయుడి అసాధారణ త్యాగాన్ని తెలంగాణ సమాజంతో పాటు రాష్ట్ర ప్రజా ప్రభుత్వం సదా గుర్తుంచుకుంటుందని కొనియాడారు. జయశంకర్ సార్ అందించిన ఉద్యమ స్ఫూర్తిని మున్ముందుకూ కొనసాగిస్తామని, ఆయన ఆశయాల సాధన కోసం ప్రజా ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంటుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. గతంలో హైదరాబాద్ రాష్ట్రాన్ని ఆంధ్ర రాష్ట్రంలో విలీనం చేయడాన్ని జయశంకర్ సార్ తీవ్రంగా వ్యతిరేకించారని తెలిపిన సీఎం, ఆనాటి ఏపీ విలీనంతో తెలంగాణ ప్రాంతానికి జరిగిన అన్యాయాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరిస్తూ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని ఆరు దశాబ్దాల పాటు సజీవంగా ఉంచిన ఘనత ముమ్మాటికీ జయశంకర్ సార్‌దేనని శ్లాఘించారు.

# రైతు వేదికలు, రైతు నేస్తంతో సాగు విప్లవం: 22.63 లక్షల మందికి వ్యవసాయ విజ్ఞానం

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, జూన్ 21: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన రైతు వేదికలు మరియు రైతు నేస్తం కార్యక్రమాలు గ్రామ స్థాయిలో రైతులకు శాస్త్రీయ సాగు పద్ధతులు, సరికొత్త సాంకేతికతలను చేరవేస్తూ రాష్ట్రంలో సరికొత్త సాగు విప్లవానికి నాంది పలికాయని వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ బి. గోపి, ఐఏఎస్ తెలిపారు. గౌరవ వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు గారి ప్రత్యేక పర్యవేక్షణలో, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం మరియు వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతు నేస్తం కార్యక్రమం ఇప్పటివరకు 95 వారాలుగా విజయవంతంగా కొనసాగుతూ, రాష్ట్రవ్యాప్తంగా 22,63,918 మంది రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తల నుంచి నేరుగా అవగాహన మరియు అమూల్యమైన సలహాలు అందించేలా నిలిచిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా వరి, పత్తి, మొక్కజొన్న, పప్పుధాన్యాలు, భూసార పరిరక్షణ, డ్రోన్ వినియోగం, డిజిటల్ వ్యవసాయం, సహజ వ్యవసాయం వంటి 200లకు పైగా విభిన్న అంశాలపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు, ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులు మరియు వర్షాల హెచ్చుతగ్గుల నేపథ్యంలో నీటి పొదుపు, ప్రత్యామ్నాయ పంటల సాగు మరియు వాతావరణ ఆధారిత వ్యవసాయంపై ప్రత్యేకంగా మార్గనిర్దేశం చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మొత్తం 2,601 రైతు వేదికలలో ఇప్పటికే 1,600 వేదికలకు హైటెక్ వీడియో కాన్ఫరెన్సింగ్ సదుపాయం కల్పించడం జరిగిందని, దీని ద్వారా రైతులు తమ గ్రామాల నుంచే నేరుగా శాస్త్రవేత్తలతో మాట్లాడి పంటల సమస్యలకు తక్షణ పరిష్కారాలు తెలుసుకుంటున్నారని, అలాగే గౌరవ ముఖ్యమంత్రివర్యులు శ్రీ అనుముల రేవంత్ రెడ్డి గారు కూడా పలు సందర్భాల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతు వేదికలతో ప్రత్యక్షంగా మాట్లాడి పంటల ప్రణాళిక, మార్కెటింగ్, ప్రభుత్వ పథకాల అమలుపై రైతులకు దిశానిర్దేశం చేశారని గుర్తుచేశారు. ప్రతి మంగళవారం అధికారులు, శాస్త్రవేత్తల సమన్వయంతో నిర్వహించే ఈ రైతు నేస్తం కార్యక్రమం ద్వారా మంచి దిగుబడులు సాధించిన రైతుల విజయగాథలను ఇతరులతో పంచుకుంటూ, కొత్త పరిశోధనలను క్షేత్రస్థాయికి చేరవేస్తున్నామని, కాబట్టి రైతులందరూ ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకొని శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేస్తూ అధిక దిగుబడులు, లాభాలు సాధించాలని డాక్టర్ బి. గోపి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# మెదక్ జిల్లాలో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు: కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్ నియోజకవర్గం, జూన్ 21 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్‌కు గాను రికార్డు స్థాయిలో ధాన్యం సేకరణ జరుగుతోందని, గత సీజన్‌తో పోలిస్తే ఈసారి రబీలో సుమారు ఒక లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం అదనంగా కొనుగోలు చేసి, రైతుల ఖాతాల్లో డబ్బులను అతివేగంగా జమ చేయడానికి తగిన చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యాసంగి సీజన్ వడ్ల సేకరణ కోసం మొత్తం 533 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా, అందులో ఇప్పటికే 528 కేంద్రాల్లో కొనుగోళ్ళు విజయవంతంగా పూర్తి చేసుకుని ముగించడం జరిగిందని, మిగిలిన కొన్ని కేంద్రాలు కూడా ప్రస్తుతం ముగింపు దశలో ఉన్నాయని వెల్లడించారు. కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేసి మిల్లులకు తరలించడం జరుగుతోందని, గత రబీ 2024-25 సీజన్‌లో 3,20,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, ఈ 2026-27 సంవత్సర రబీ సీజన్‌లో జూన్ 20వ తేదీ నాటికి జిల్లాలో రికార్డు స్థాయిలో 4,18,244.360 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడం జరిగిందన్నారు. దీని ద్వారా జిల్లా వ్యాప్తంగా మొత్తం 86,130 మంది రైతులకు ప్రయోజనం చేకూరిందని, వారికి సంబంధించిన రూ. 892.62 కోట్ల రూపాయలను వారి ఖాతాల్లో వేగంగా చెల్లించామని వివరించారు. గతం కంటే ఈ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్ళు, చెల్లింపుల ప్రక్రియను ఎంతో సమర్థవంతంగా నిర్వహించామని, కొనుగోళ్ళు ముగింపు దశలో ఉన్నందున రైతులెవరూ ఎలాంటి ఆందోళన చెందవద్దని కలెక్టర్ ప్రతిమా సింగ్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.